# ఒక భర్త కథ

'రాధిక'

"ఏమండీ! పెళ్లయిన తరువాత అబ్బాయి చాలా మారిపోయాడండీ. అసలు మన గురించి ఏమీ పట్టించుకోవడం కాదు. రత్నంలాంటి మనసు వాడిది. రాయిలా అయిపోయింది." వాపోయింది కామేశ్వరి.

"ఇప్పుడు మనకేం తక్కువయిందనీ?" శంకరం సాగదీశాడు - 'ఈ ఆడవాళ్లు ఇంతే సుమా' అన్నట్లు.

"ప్రస్తుతం ఏమీ కాలేదనుకోండి. ఇప్పటి నుండి మనకు దూరంగా, డబ్బు పంపకుండా అనిల్‌కి అలవాటు అయిపోతే ముందు ముందు ఎలాగండీ?" గండిపడిన గోదావరిలా ఉంది ఆమె మనసు.

శంకరం ఏమీ మాట్లాడలేదు. ఆలోచనలో పడ్డాడు. నాలుగు రోజుల తరువాత అనిల్ దగ్గర నుండి మూడు వందలు మనియార్డరు వచ్చింది. అది చూసి నంబరపడిపోయింది కామేశ్వరి. కొడుక్కి తల్లిదండ్రుల విలువ గురించి నీతి బోధలు చేస్తూ ఉత్తరం రాసినట్లు భర్తకు చెప్పలేదు. దాని ఫలితమే ఆ మనియార్డరు అని కామేశ్వరికి అర్థం అయింది.

రోజులు గడుస్తున్నాయి. నెల నెలా డబ్బు వస్తూనే ఉంది. అనిల్ ఢిల్లీలో పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. అస్తమానమూ శలవులు దొరకని ఉద్యోగం. ఒకసారి మనియార్డరు వేరే ఆయన పేరు మీద వచ్చింది. ఆయన ఉత్తరం కూడా రాశారు - "మీకు డబ్బు పంపుతుంటే మీ కోడలు అనిల్‌ని నానా మాటలూ అంటుందట. అందుకే ఇకపై నా పేరు మీదే పంపుతాను" అని. ఆ ఉత్తరం రాసి నాయన శంకరం స్నేహితుడు. ఢిల్లీలో వ్యాపారం చేస్తున్నాడు.



ఆంధ్రాకి, ఢిల్లీకి ఆ పేట నుండి ఈ పేటకు తిరిగినట్లు తిరుగుతాడు.

అనిల్ చెల్లెళ్లు ఇద్దరూ పెళ్లిళ్లు చేసుకుని స్థిరపడిపోయారు. అన్నయ్య దగ్గరకు వెళ్లాలని గాని, అన్నయ్య మాకు ఏమీ పెట్టడంలేదనిగాని పట్టించుకోరు. అలాంటి శిక్షణ ఇచ్చాడు పిల్లలకు శంకరం. అనిల్ ఏ రెండేళ్లకో ఒకసారి వచ్చి ఒక రోజు ఉండి, అత్తగారి ఊర్లో ఎక్కువ రోజులు ఉండి వెళ్లిపోతాడు. అదే సమయంలో చెల్లెళ్లు కూడా వచ్చి అన్నయ్యను చూసిపోతూ ఉంటారు.

కొడుకు డబ్బు రహస్యంగా పంపుతున్నాడు. కాబట్టే, ఆ విషయం గురించి మాటలోగానీ, ఉత్తరాల్లోగానీ బయటపెట్టవద్దని మొదటే భార్యను ఆదేశించాడు శంకరం. దానితో ఆవిడ డబ్బు విషయం ఎత్తదు కొడుకు దగ్గర. ఆ విషయంలో కోడలికి తెలిస్తే వాళ్ల కాపురంలో కలతలు వస్తాయని శంకరం భయం.

అప్పుడప్పుడు కూతుళ్లు పురుళ్లకు వచ్చినా, మరే ఖర్చు అదనంగా తమ మీద పడ్డా ఉత్తరం రాస్తుంది కామేశ్వరి కొడుక్కి. అదీ కొడుక్కి మాత్రమే అర్థం అయ్యేట్లు. ఆ నెలలో ఆ ఖర్చులకు సరిపడా మనియార్డరు వస్తుంది. ఆ డబ్బులో పెద్దగా అవసరం లేకపోయినా, కొడుకు తమ నుండి దూరం కాలేదు అనే భావనను ఆ డబ్బు కలిగిస్తుంది. ఎంతో తృప్తిగా, ఆనందంగా మెరిసే భార్య కళ్లను చూడడమంటే శంకరానికి ఎంతో ఇష్టం.

తన సంసారాన్ని ఎంతో అపురూపంగా చూసుకుని, ఎంతో సహనంతో చిన్న విషయంలో కూడా విసుక్కోకుండా పైకి తీసుకుని వచ్చిన భార్య అంటే ప్రాణానికి ప్రాణం శంకరానికి. ఒకవేళ ఆ బాధ్యతలో లోపాలున్నా తనే సమర్థించుకునేవాడు శంకరం. వారిద్దరి జీవితంలో అలా సమర్థించుకునే అవసరం శంకరానికీ రాలేదు. భార్యను ఏ చిన్న విషయంలోనూ కూడా నొప్పించే పరిస్థితి శంకరానికీ రాలేదు. ఇద్దరూ ఆది దంపతుల్లాగే కాపురం చేశారు.

చిన్న చిన్న విషయాల్లో భార్య సలహా పాటించాలి. పెద్ద వాటిల్లో భర్త సలహా పాటించాలి అన్నది ఇద్దరికీ తెలుసు. అందుకే వారి జీవితంలో కలతలు, కన్నీళ్లు అసలు ప్రవేశించనే లేదు.

సంవత్సరాలు జరుగుతున్నాయి. కామేశ్వరికి అనారోగ్యంగా ఉంది. మందులకు డబ్బు ఎక్కువ పంపుతున్నాడు అనిల్. ఆమెను పసిపిల్లాడిలా చూసుకుని లేచి తిరిగేట్టు చేశాడు శంకరం. కొడుకు చూడడానికి రానేలేదు. కూతుళ్లు వచ్చి ఒకసారి పరామర్శించి వెళ్లిపోయారు.

నట్టింట్లో జబ్బు నయమై తేలికగా తిరుగుతున్న భార్యను చూసి పరమానందం పొందాడు. శంకరం మనసులో అనుకున్నాడు. "నా అర్ధాంగీ! నీవు మిగిలిన కాలమంతా ఇలా సంతోషంగానే గలపాలి. నీ సంతోషమే నా ఆయుస్సు పెంచుతుంది. నీవు నా భార్యగా ఏనాడూ బాధపడలేదు. ఒక తల్లిగా మాత్రం నే నుండగా నీవెందుకు బాధపడాలి ? అందుకే అనిల్ పంపుతున్నట్లుగా నా స్నేహితుడు డబ్బు నెల నెలా పంపేటట్లు నేనే ఏర్పాట్లు చేశాను. నా స్నేహితునికి ఆ డబ్బు నేనే ఇస్తున్నాను."

కొడుకు డబ్బు పంపడానికి కుదరదు అని రాసిన ఉత్తరం ఎన్ని ఏళ్ల క్రితమే చింపేశారు శంకరం.

●



# అమ్మకోసం

"ఇదీ విన్నారా?" పేపరు చదువుతున్న విశ్వనాథంతో అంది కామాక్షి.

"నువ్వు చెప్పేది నేను వినేది ఒకే విషయం. ఇప్పుడు ఎవరికో పెళ్లంటావు."

"అమ్మాయి ఎవరో తెలుసుకోవాలని ఉండదా?"

"అయితే త్వరగా చెప్పు. నాకు పని ఉంది."

"పరమేశ్వరం గారి అమ్మాయి పద్మకు పెళ్లి. మన అమ్మాయి కంటె నాలుగేళ్లు చిన్నది. మన పల్లవి ఇలాగే ఉంది. దానికి కల్యాణ ఘడియ ఎప్పుడు వస్తుందో, ఏమో!" విచారంగా అంది కామాక్షి.

"ఎవరిదో పెళ్లని పల్లవిని తిడతావు. తప్పంతా పల్లవిదే అన్నట్టు మాట్లాడకు. తప్పంతా నాది. నేను అశక్తుడిని. వేలకు వేలు ఖర్చుపెట్టి దాని పెళ్లి చెయ్యలేను. ఈ రోజునుంచి, పెళ్లిమాట ఇంట్లో అనటానికి వీల్లేదు!"

"మీకేం? నలుగురూ మిమ్మల్ని అడిగితే తెలుస్తుంది. ప్రతీ ఒక్కరూ పల్లవికి ఇంకా పెళ్లి చెయ్యరే మని-అడుగుతుంటే, జవాబు చెప్పలేకపోతున్నాను."

"మనకు ఉన్న ఇబ్బందులు బయటవాళ్లకు తెలుస్తాయా?"

"ఇబ్బందులంటూ పెళ్లి చెయ్యడం మానేస్తారా?"

"కామాక్షీ! గొంతు తగ్గించు, అమ్మాయి వింటుంది."

"రోజూ జరిగేది ఇంతేను." చిన్నగా నిట్టూర్చింది కామాక్షి.

** ** **

"ఏమండీ! పల్లవి స్నేహితురాలు నీరజకు పెళ్లిట, మామూలు పెళ్లికాదుట. ప్రేమించి పెళ్లి చేసుకుంటోందిట. అబ్బాయి బాగుంటాట్ట. మంచి చదువు, ఉద్యోగం అన్నీ ఉన్నాయిట. చూశారా... విచిత్రంగా ఉంది కదూ?"

"విచిత్రంగా ఏంలేదు."

"అవునులెండి. మీకు ఏమీ అనిపించదు. నీరజను చూస్తే తెలుస్తుంది. మన పల్లవి కంటె ఏమీ అందంగా ఉండదు. అయినా... నీరజను ప్రేమించి పెళ్లి చేసుకుంటున్న అబ్బాయి ఎవరో? మన పల్లవికి ఏంతక్కువ? అందం, చదువు, ఉద్యోగం అన్నీ ఉన్నాయి. అయినా పల్లవిని ఎవరూ ప్రేమించరే? పల్లవిని కూడా ఎవరయినా ప్రేమించి పెళ్లి చేసుకుంటే బాగుండును. కట్నాల బాధ ఉండదు. ఏమంటారు?"

"నీకు పిచ్చి పట్టిం దంటాను. అమ్మాయి వింటే బాధ పడుతుందని కూడా ఆలోచించటం మానేశావు. నీకు చెప్పి చెప్పి విసుగొస్తోంది కాని, నీ ధోరణి మారటం లేదు."

"అనండి. ఇంకా అనండి. ప్రతి ఒక్కరూ పల్లవి పెళ్లెప్పుడని అడుగుతుంటే, ఏం చెప్పను? నాకెంతో బాధగా ఉంటోంది."

"రేపటినుండి బయటకు వెళ్లకు."

** ** **

"ఏమయిందీ, కామాక్షీ! అమ్మాయి ఇంటికి వచ్చిందా? ఆ కంగారేమిటి?"

"అమ్మాయి వచ్చింది."

"ఏం జరిగింది?" విశ్వనాథంలో ఆత్రుత పెరిగింది.

"పల్లవికి పెళ్లిట."

"ఏమిటీ... !?"

"పెళ్లెప్పుడని అంతా అడుగుతుంటే వెర్రిమొహం పెట్టాను. మన అమ్మాయి పెళ్లని మనకు తెలియదు కాని, ఊళ్లో అందరికీ తెలిసింది."

"ఎలా తెలిసిందిట? ఎవరు చెప్పారో అడిగావా? వివరాలు కనుక్కున్నావా?"

"కలలో కూడా ఊహించలేని వివరాలు వినండి. అబ్బాయి అమెరికాలో ఉన్నాట్ట. పెద్ద ఉద్యోగం చేస్తున్నాట్ట. కట్నం వద్దన్నాట్ట. ఒక సంవత్సరం తరువాత ఇండియాకు వస్తాట్ట. అప్పుడే పెళ్లి చేసుకుంటాడుట- అని, సూకాలు చెప్పిందిట."

"ఇంత అబద్ధం ఎలా చెప్పగలిగింది?" ఆలోచిస్తూ అన్నాడు విశ్వనాథం.

"రేపు పనికి వస్తుంది కదా! దాన్ని వదులుతానా? లేనిపోని అబద్ధాలు ఎందుకు చెప్పిందో కనుక్కుంటాను."

** ** **

"సూకాలు నెందుకు అడగాలి! నేను చెప్పింది చెప్పినట్టు అందరికి చెప్పింది." పల్లవి నిర్భయంతో చెప్పింది.

"పల్లవీ! ఇంత పెద్ద అబద్ధం ఆలోచించే చెప్పావా?" విశ్వనాథం అడిగాడు.

"నా పెళ్లెప్పుడని అంతా అడిగే ప్రశ్నలకు జవాబు చెప్పలేక అమ్మ బాధ పడుతోందని, ఒక సంవత్సరం విశ్రాంతి ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ అబద్ధాన్ని అమ్మకోసం పుట్టించాను. నన్ను క్షమించండి!"

పల్లవి మాటలకు మతిపోయినట్టయింది భార్యాభర్త లిద్దరికీ!

'పుష్యమి'